# శ్రీచక్రశాస్త్ర విజ్ఞానము




ఆంగ్ల మూలము
డాక్టర్ పప్పు వేణుగోపాలరావు

తెలుగు అనువాదం
ఖరిదేహాల్ వేంకటరావు

# శ్రీచక్ర శాస్త్ర విజ్ఞానము

ఆంగ్ల మూలము

**డాక్టర్ పప్పు వేణుగోపాలరావు**

తెలుగు అనువాదం

**ఖరిడేహాల్ వేంకటరావు**

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| 1 | మంత్రము యంత్రము తంత్రవము | 1 |
| 2 | శ్రీచక్రముము | 8 |
| 3 | నవావరణలు | 12 |
| 4 | శ్రీచక్రము – శ్రీవిద్యద్య | 36 |
| 5 | శ్రీచక్రము – కుండలిని | 46 |
| 6 | త్రిపురసుందరీదేవి | 55 |
| 7 | మంత్రార్థము | 64 |
| 8 | శ్రీచక్ర పూజ | 77 |
| 9 | శ్రీసూక్తానుసారము శ్రీచక్రపూజా విధానము | 81 |
| 10 | దశముద్రలు | 85 |
| 11 | శ్రీచక్ర శాస్త్ర గ్రంథములు | 88 |
| 12 | దీక్షితార్ కమలాంబా నవావరణ కృతులు | 91 |

# అధ్యాయము 1

హిందూమతములో అనేక విషయములు మతములకు ప్రతీకలుగా గోచరించును. లౌకికముగా లేక అధ్యాత్మికముగా చేబట్టు ఏ కర్మలోనైనా ముఖ్యముగా మూడు అంశములుండును. అవి: (1) సాధనము (2) విధానము (3) లక్ష్యము. శాస్త్రీయముగా వీటిని ఈ క్రింది విధముగా పేర్కొనవచ్చును.

1. చిత్రపటము లేక రేఖా చిత్రము (design)
2. సూత్రము లేక సమీకరణము
3. ఆచరణ పద్ధతి లేక ప్రక్రియ

పై మూడును అధ్యాత్మిక పదజాలములో వరుసగా మంత్రము, యంత్రము, తంత్రములుగా పిలువబడుచున్నవి. ఈ మూడింటి మధ్య విడదీయరాని సంబంధము కలదు. వీటిని సరిగ్గా ఆకళింపుచేసికొనినపుడు అవి ముక్తికి దారి తీయును. ద్రష్టలు, స్రష్టలు దీర్ఘకాలము తపస్సు చేసి పొందిన ఆధ్యాత్మికానుభవముల ఫలితంగా పై మూడింటి ఆవిర్భావమునకు, వాటి ఎదుగుదలకు దోహదపడిరి.

## మంత్రము

అక్షరములతో కూర్చబడినది మంత్రము. మననముచే సాధింపబడుటచేత ఇది మంత్రమని చెప్పబడుచున్నది. మననమనగా ఆలోచనా ప్రక్రియ. మంత్రము నుచ్చరించినపుడు ఆలోచనా ప్రక్రియ సాగును. 'త్ర' అనునది 'త్రై' ధాతువునుండి వచ్చినది. దీని అర్ధము విముక్తి కలిగించుట. 'త్రాణ' అనగా ఇహలోక లేక సంసారబంధములనుండి విముక్తి. సూక్ష్మంగా 'రక్షణ' అనవచ్చును. దేనిని పఠించుట లేక ఉచ్చరించుట వలన రక్షణ కలుగునో అది మంత్రము. (మననాత్ త్రాయతే ఇతి మంత్రః).

మంత్రము శబ్దతరంగముల సమూహశక్తి, అక్షరములతో కూడినది. సంస్కృతభాషలో అన్నియు అక్షరములే, అనగా నశించనవి యని అర్ధము.

మంత్రము ఒక విధమైన శబ్దశక్తి స్వరూపము. శబ్దము శూన్యముయొక్క స్వభావము. శబ్దము ఆకాశము యొక్క గుణము. దీనిని శబ్దబ్రహ్మమని కూడ అందురు. శబ్దరూపములో వ్యక్తమగు పరబ్రహ్మము. శబ్దము రెండు రకములు – అక్షర శబ్దము, ఇతరము. రెండు వస్తువుల రాపిడి వలన కలుగు శబ్దము రెండవ రకము. అక్షర శబ్దము ఎటువంటి రాపిడి గాని శ్రమగాని లేకుండ జనించునది. దీనిని 'అనాహత' శబ్దమందురు. దార్శనికుల అభిప్రాయానుసారము ఇది శాశ్వతము. ఈ శబ్దము ఉచ్చరించుటకు ముందు, ఉచ్చరించిన తరువాత లేనిదని చెప్పవచ్చును. మరియు ఉచ్చరించుటకు చేయు ప్రయత్నమును గమనించవచ్చును. స్థూలముగా ఈ విషయములు అక్షరశబ్దము తాత్కాలికమను భావము కలిగించును. కాణాద, గౌతమ, శంకరమిశ్ర, వాచస్పతి మిశ్ర, ఉదయనాచార్య, తదితరులు పై విధంగా భావించినవారిలో కొందరు. ఈ అభిప్రాయమును ఇతర తత్త్వసిద్ధాంత పండితులు, వ్యాకరణశాస్త్ర పండితులు ఖండించిరి. అక్షరశబ్దము ఉచ్చరించుటకు పూర్వమే కలదని వారి వాదము. కాకపోతే దానిని వెలిబుచ్చుటకు ప్రయత్నము అవసరము. అక్షరశబ్దము శాశ్వతమైనప్పటికి, మానవ కర్ణేంద్రియము తాత్కాలికముగా గ్రహించును. శ్రవణానంతరము కూడ శబ్దతరంగములు శాస్త్రీయంగా ఎంతో దూరము ప్రయాణించగలవు. కాబట్టి అక్షరశబ్దము శాశ్వతమే కాని తాత్కాలికము కాదు. అక్షరశబ్దము యొక్క శాశ్వతత్వమును వేదములు ఆమోదించుచున్నవి.

**'వాచా నిరూప నిత్యతా'** – ఋగ్వేదము

ఒక నిర్ణీత పద్ధతిలో నుండు అక్షరముల పొందికయే మంత్రము. ఇది దేవి యొక్క సూక్ష్మరూపము. శబ్దశక్తి జీవులకు ప్రాణ మొసగును. నిత్యము ఉచ్ఛ్వాస నిశ్వాసములు తీసికొనునపుడు, మనకు తెలియకుండగనే గొప్ప మంత్రము నుచ్చరించుట జరుగును. దీనినే 'అజప మంత్రము' లేక హంసగాయత్రి అందురు. ఎందుచేతననగా యెటువంటి ప్రయత్నము లేకుండ సహజముగా తనకు తాను పదే పదే ఉచ్చరించబడును.

ఈ శబ్దశక్తి (ప్రణవనాదము) అన్ని జీవులలో 'ఎరుకా'గను, మానవులో 'కుండలిని'గను ఉన్నది. వ్యక్తము చేయ సంకల్పము అతీతమైనదిగా చెప్పబడుచున్నది. ఇది మూలాధారమందు 'పరావాక్కు'గా ఉన్నది. ఇది ఉద్భవించి స్వాధిష్ఠానస్థాయి చేరుకొనినపుడు 'పశ్యంతి' (అనగా గ్రహించుట) అని పిలువబడుచున్నది. దానికి కొద్దిగా పైనున్న హృదయస్థాయికి చేరుకొనినపుడు 'అనాహత'మని, అంతకు పైని కంఠము దిగువ స్థాయి చేరినపుడు 'మధ్యమా' అని పిలువబడుచున్నది. కంఠస్థాయిలో 'విశుద్ధ'ముగను, చిట్టచివరకు ఉచ్చారణగా బహిర్గతమై వ్యక్తమైనపుడు 'వైఖరీ' యని తెలియుచున్నది.

మంత్రమునందు బీజాక్షరములు నిక్షిప్తమై ఉండుటచేత అనువదింప వీలులేదు. కాబట్టి అనువదించినపుడు, మంత్రము మంత్రముగా ఉండదు. కారణమేమనగా శబ్దము తీరు మారిపోవును.

కొన్ని ఉద్వేగములను సృష్టించుటకు గాని, లేక నశింపజేయుటకు గాని మాటలకు శక్తి కలదని మనమందరము ఎరిగినదే. సామాన్యమైన పరిణామముల కతీతమైన శక్తి మాటలకు కలదు. మనము గ్రహించు సామర్ధ్యమునకు మించిన శక్తులు వాటికి కలవు. సాధారణమైన అక్షరశబ్దములు స్థూల స్వభావము కలవి. బీజాక్షరములతో నిక్షిప్తమైన మంత్రములు సూక్ష్మమైనవి. మంత్రములను సరియైన తీరులో ఉచ్చరించినపుడు శబ్దతరంగము లేర్పడును. ఈ శబ్దతరంగములనే మంత్రశక్తి అందురు. ఒక క్రమపద్ధతిలో కొంతకాలము మంత్రమును పఠించినపుడు 'సాధనాశక్తి' ఉద్భవించును. ఆ విధముగా మంత్రమునకు రెండు శక్తులున్నవి. ఒకటి మంత్రశక్తి, రెండవది సాధనాశక్తి. అదేపనిగా కొంతకాలము ఒక పద్ధతి ప్రకారము మంత్రము నుచ్చరించినపుడు సాధనాశక్తి కలుగును. ఈ రెండు శక్తుల సమ్మేళనమును 'మంత్రసాధన' అందురు. అనగా ఈ రెండు శక్తుల సమ్మేళన ఫలితంగా కలుగు శక్తి. అదియే ఆశించు ఫలితము.

మంత్రములు ఏకాక్షరము మొదలుకొని ఒక దేవి లేక దేవత యొక్క సహస్రనామముల వరకు ఉండవచ్చును. నిత్యాతంత్రము ప్రకారము మంత్రములు ఈ క్రింది విధముగా విభజించబడినవి.

– ఒకే ఒక అక్షరము గల ఏకాక్షర మంత్రము. దీనిని 'పిండ' అందురు.
– రెండు అక్షరములు గల మంత్రము. దీని 'కర్తరీ' అందురు.
– 3 నుండి 9 అక్షరములు గల మంత్రములను 'బీజ' మందురు.
– 10 నుండి 20 అక్షరముల గల మంత్రములను 'మంత్ర' మందురు.
– 20 అరములు మించిన మంత్రమును 'మాల' అందురు.

*మంత్ర ఏకారాః పిండకాః కర్తర్యో ద్వ్యక్షరా మతాః*
*వర్ణత్రయం సమారభ్య నవర్ణావధి బీజకాః*
*తతో దశార్ణమారభ్య యావద్వింశతి మంత్రకాః*
*తత్ర ఊర్ధ్వగతాః మాలాః తాసు భేదో న విద్యతే*

*(నిత్యాతంత్ర)*

పులింగ దేవతలకు సంబంధించిన మంత్రములను 'మంత్ర' మనియు, స్త్రీలింగ దేవతలకు (దేవి) సంబంధించిన మంత్రములను 'విద్యా' అనియు అందురు.

***పుంద్వైవత్యాః మంత్రాః స్త్రీదైవత్యా విద్యా ఇతి***
***(సౌభాగ్య భాస్కరం)***

క్రమపద్ధతిలో మంత్రము నుచ్చరించకుండుట, అర్ధము తెలియకుండ మంత్రము నుచ్చరించుట కేవలము భౌతిక వ్యాయామమగును. మంత్ర పఠనములో అనేక దశలున్నవి. అవి: ఉపదేశము, సరియైన ఉచ్చారణ, ఉచ్చరించుటకు తగిన సమయము (కాలము), స్థలము, అనుసరించవలసిన ఇతర పద్ధతులు (మార్గములు). ఈ విషయములను అనేక గ్రంథములు విశదపరచి, మంత్రము పఠించుటకు ముందు తీసికొనవలసిన ప్రాథమిక చర్యలను కూడ సూచించెను. ఉదాహరణకు:

ముఖశోధన – అనగా ముఖము శుభ్రపరచుకొనుట
జిహ్వాశోధన – అనగా నాలుక, నోరు శుభ్రపరచుకొనుట

'ఓం'కారమును ఏయే మంత్రములకు ముందు చేర్చవలెను, ఏయే మంత్రములకు వెనుక చేర్చవలెనను విషయమై కొన్ని నిబంధనలు గలవు. మంత్రశాస్త్రమునకు సంబంధించిన వివిధ గ్రంథములు ఇందుకు సంబంధించిన నిబంధనల నేర్పరచెను.

దానము, యజ్ఞము, తపస్సు, వేదవిద్యాభ్యాసము, ధ్యానము, ప్రాణాయామము, అగ్నిహోత్రము, పితృకర్మలు ఇత్యాది వాటికి ముందు ఓంకారము నుచ్చరించవలెనని శాకటాయన స్మృతి తెలుపుచున్నది.

***దానయజ్ఞతపస్స్వాధ్యాయ జపాధ్యాన సంధ్యోపాసనా ప్రాణాయామ***
***హోమదైవ పిత్ర్యమంత్రోచ్చారణ బ్రహ్మారంభాదీని ప్రణవముచ్చార్య ప్రవర్తయేత్***
***(శాకటాయన స్మృతి)***

మంత్రమే దేవత; ఆ రూపములో పరబ్రహ్మము వ్యక్తముకాగా, సాధకుడు మంత్రము నభ్యసించును. సాధకుని అభ్యాసము చేత మంత్రము జాగృతమగును. మంత్రము యొక్క అర్ధము, మంత్రపఠనము వలన కలుగు ప్రయోజనము తెలిసికొనుట చాల అవసరము. ఉదాహరణకు ఓంకారములో అ, ఉ, మ్ అను అక్షరములున్నవి. 'అ' అగ్నిని, 'మ్' చంద్రుని సూచించును. మనకు కావలిసినదాని ననుసరించి, అవసరమైన అక్షరముపై ఎక్కువ ఒత్తిడితో ఉచ్చరించవలసియుండును. అగ్ని అవసరమైనపుడు, 'అ' అక్షరముపై వత్తిడి ఎక్కువగా నుండవలెను. ఇది అగ్నియొక్క నాభిస్థానమైన మణిపూరమునకు చెందినది. సాధకునికి సాంత్వనము లేక శాంతి కావలసియున్నచో, శిరస్సునుండి 'మ్' అక్షరముపై వత్తిడి పెంచి ఉచ్చరించవలెను. అందుచేత ప్రతి మంత్రమునకు తులనాత్మక పరిణామము, ఉచ్చారణ పద్ధతి కలవు. సరియైన గురువు సహాయముతో వీటి నర్ధము చేసికొనవచ్చును.

ఏ మంత్రమునందైన ఆరు భాగములుండును. అవి: ఋషి, ఛందస్సు, దేవి లేక దేవత, బీజము, శక్తి, కీలకము.

మంత్రము యొక్క ముఖ్య ప్రయోజనము సాధకుని లేక భక్తుని రక్షణ. కాబట్టి ఈ సందర్భములో అనేక ఉపాంగములు ప్రస్తావించదగినవి.

. కవచము
. అస్త్రము (రక్షణాయుధము)
. వర్మ (వస్త్రము)
. హృదయము

'అ' మొదలు 'క్ష' వరకుగల వర్ణమాలలో అన్నియు మాతృకలే. అవి శాశ్వతమైనందున వాటిని అక్షరములందురు. వాటికి ఆద్యంతములు లేవు. ఏకాగ్రతతో మంత్రము పఠించినపుడు కలుగు ఫలితమును 'మంత్రసిద్ధి' యందురు. సాధకుడు నిరంతరము ఒకేవిధముగా ఏకాగ్రతతో మంత్రపఠనము నభ్యసించినచో మంత్రసిద్ధి పొందగలుగును.

## యంత్రము

అన్ని మతములందు అనాదికాలమునుండి నిరాకార పరబ్రహ్మమునకు ఒక రూపకల్పన చేయుట సంప్రదాయముగా ఉన్నది. చిత్రపటములు, విగ్రహములు, చిహ్నములు, క్షేత్రగణిత పటములు ఇందుకొరకు ఉపయోగింపబడుచున్నవి. 'యంత్ర' అను పదము 'యమ్', 'త్రై' అను రెండు ధాతువులనుండి ఏర్పడినది. 'యమ్' ధాతువున కర్థము నియంత్రణము. 'త్రై' ధాతువున కర్థము రక్షించుట. 'యమ్' ధాతువుకు 'గృహ'మను అర్థము కూడ కలదు. కాబట్టి 'యంత్ర' అను పదము నివాసము లేక గృహమును సూచించును. కొన్ని శక్తులతో నిక్షిప్తమైన పరికరము లేక క్షేత్రగణిత పటము. ఇది స్తబ్ధమైన చిత్రపటము కాదు, శక్తిపూర్వకమైన చిత్రపటము. యంత్రము ఒక ఆకారము లేక అంగము. అవసరమున కనుగుణముగా ఒక నిర్ణీత పద్ధతిలో మంత్రములోని శక్తులను నియంత్రించు పటము. మానవలక్షణములు ప్రతిబింబించు దేవి లేక దేవత కంటె సూక్ష్మమైనది, శక్తిమంతమైనది.

సాధకుడు ఆశించిన లక్ష్యమును మంత్రము యంత్రముల ద్వారా సాధించునని తంత్రశాస్త్రము తెలియజేయుచున్నది. యంత్రము ఒక విధమైన ఆకారము లేక శక్తి కావచ్చును. అంతేకాక, వాస్తవము, ప్రతీక, లేక ఆదర్శము కూడ కావచ్చును.

'యమ్' అనునది వాయుతత్త్వమునకు మూలము. వాయుతత్త్వముచే ఏర్పడు శక్తి చలనశక్తి, లేక భవిష్యత్తులో పెరుగు శక్తి (potential energy) కావచ్చును. ఇదియే విశ్వశక్తి లేక ప్రాణము. దీనిని పురస్కరించుకొని యంత్రమను పదము అనేక విధములుగా వర్ణింపబడుచున్నది. దేవతా విగ్రహము భౌతికమైన లేక బాహ్యమైన లక్షణములను సూచించగా, యంత్రము దేవత యొక్క సారమును ప్రతిబింబించు ప్రతీకగా చెప్పబడుచున్నది. సాధారణముగా యంత్రము ద్వారా దేవి లేక దేవతను పూజించుట, విగ్రహము లేక ప్రతిమను పూజించుటకన్న మిన్నగా పరిగణింపబడుచున్నది. విగ్రహము కన్న యంత్రమునకు ఇచ్చే ప్రాధాన్యత, దేవాలయములలో విగ్రహములను ప్రతిష్ఠించునపుడు స్పష్టముగా గోచరించును. విగ్రహము ప్రతిష్ఠించుటకు ముందు యంత్రము నేర్పరచి, దానిపై విగ్రహము ప్రతిష్ఠించెదరు.

సర్వసామాన్యంగా యంత్రములు క్షేత్రగణిత సరళరేఖలు, వృత్తములు, త్రిభుజములు, చతురస్రములు, దీర్ఘచతురస్రములు, పద్మదళములు కలిగియుండును.

యంత్ర చిత్రీకరణలో శక్తిని నిక్షిప్తము చేయు ప్రక్రియను 'మండల' మందురు. ***'మంత్రం లాతి ఇతి మండల'***. మండల మనగా ముఖ్యవివరములను ఒకచోట పొందుపరచుట. ఏకాగ్రతతో దృష్టి లగ్నము

చేయుట కిది యొక పరికరము లేక వాహనము. ఇది శక్తుల సమూహము, మరియు ఫలవంతమైన వివిధ శక్తుల సమాహారమునకు చిహ్నము. ప్రతి యంత్రము ఒక కేంద్రబిందువు కలిగియుండును. సంక్షిప్తముగా దీనిని 'బిందు'వందురు. యంత్రమంతట విస్తరించియున్న శక్తిసారమే బిందువు. అధ్యాత్మికశక్తి యంత్రమునకు మాత్రమే పరిమితము కాకుండ, యంత్రమున కావలనున్న సాధకుని యొద్దకు, అంతకుమించి కూడ విస్తరించి మార్పు చెందుచు, అనేక రెట్లు పెరుగుచు విలీనము చేయునో అదియే బిందువు. ఆ విధముగా బాహ్యాంతరములకు సంబంధించిన ఒక విధమైన విశ్వతత్త్వపు ప్రక్రియ. కొలతల కతీతముగా స్వేచ్ఛను ప్రతిబింబించు ప్రతీక బిందువు. కాబట్టి మండలము లేక యంత్రము కేవలము పటము మాత్రమే కాదు, విశ్వతత్త్వ చిత్రము. ఇది సాధకుని శక్తిని ఉత్తేజపరచి, బాహ్యాంతరములందు మార్గము నిర్దేశించును.

మండల తత్త్వము వివిధ పొరలు, ఆవరణలు గల విశ్వమును ప్రతిబింబించును. మూడుకొలతల (three-dimensional) యంత్రములు, మేరు చక్రము వంటివి కూడ కలవు. మానవశరీరము కూడ మూడుకొలతలు గల చైతన్యమనవచ్చును.

యంత్రము సాధకుని భౌతికశక్తులను నియంత్రించి రక్షించుటలో తోడ్పడుటేగాక, దివ్యశక్తితో విలీనము చేయును. ఇంతకు పూర్వము వివరించినట్లు, యంత్రమను పదములో రెండు అంశములు – నియంత్రణము (యమ్), రక్షణ (త్ర) – గలవు. ఒక విధముగా నియంత్రణే రక్షణ కదా!

## తంత్రము

జ్ఞానమును వివరించి విశదీకరించునది తంత్రము. మంత్ర యంత్రములకు సంబంధించిన జ్ఞానము, వాటి నాచరించు విధానము తంత్రము. తంత్రమునందు నాలుగు అంగములు కలవు.

. తత్త్వము (జ్ఞానము)
. ధ్యానము
. క్రియ (వివిధ కర్మకాండలు)
. జీవించు తీరు లేక జీవన విధానము

తంత్రము గుప్తశాస్త్రము. మరియు గ్రాహక కళ.

తంత్రమనగా పూజించు లేక అర్చించు విధానము. 'తం' అనగా విస్తరింపజేయు అని యర్థము. 'త్ర' అనగా రక్షించుట. తంత్రమనగా జ్ఞానమును పెంపొందించు శాస్త్రము.

***తన్యతే విస్తార్యతే ఇతి తంత్రః***

తంత్రశాస్త్రము మంత్రయంత్రములతో అభ్యసించు విధానములను వివరించును. వామకేశ్వర తంత్రము అరువది నాలుగు వివిధ కౌలతంత్రములను వివరించుచున్నది. కేవలము భౌతికమైన సౌకర్యములను పొందు విధానములను తెలుపుటచేత, కొందరు దీనిని అవైదికమని భావించెదరు.

తంత్రము భౌతికమైనదని సామాన్య అభిప్రాయము. కాని యిది సరియైనది కాదు. తంత్రములు ఎల్లపుడు వైదికాచారములతో పెనవేసికొనియున్నవి. అయితే కట్టుబడియుండుటలోను, ఆచరణలోను కొన్ని భేదములు కలవు. సాధకుల వాంఛల ననుసరించి తంత్రశాస్త్ర సిద్ధాంతము, అభ్యాసము మారుచుండును.

త్రిగుణముల (సత్త్వ రజస్ తమస్) ఆధారంగా తంత్రములు విభజించబడెను. సాత్త్విక తంత్రములను 'తంత్రమని, రాజసిక తంత్రములను 'యామల'మని, తామసిక తంత్రములను 'దామర'లని పిలిచెదరు.

వివిధ తత్త్వసిద్ధాంతముల ఆధారంగా తంత్రశాస్త్రములు కలవు.

. బౌద్ధతంత్రము
. జైనతంత్రము
. శైవతంత్రము
. శాక్తతంత్రము
. వైష్ణవతంత్రము
. గాణాపత్యతంత్రము

శాక్తతంత్రములు మరల మూడుగా విభజించబడెను. అవి: కౌల, సమయ, మిశ్ర తంత్రములు.

కౌలమార్గము తనకు తాను ద్వైత, అద్వైతములు రెండును లేనిదిగా నిర్వచించుకొనెను.

***అద్వైతం కేచిదిచ్ఛంతి ద్వైతమిచ్ఛంతి చాపరే***
***మమ తత్త్వం విజానంతో ద్వైతాద్వైత వివర్జితమ్***

వివిధ తత్త్వ సిద్ధాంతముల ఆధారంగా తంత్రములు ఏడు తరగతులుగా విభజించబడెను.

. వేదాచారము
. వైష్ణవాచారము
. శైవాచారము
. సిద్ధాంతాచారము
. కౌలాచారము
. వామాచారము
. దక్షిణాచారము

వామాచారము లేక వామహస్త (ఎడమ) మార్గము ఆనందమార్గముగను, దక్షిణహస్త (కుడి) మార్గము శాంతిమార్గముగను చెప్పబడుచున్నది. దక్షిణాచార వామాచార మార్గములు వరుసగా 'సమయ', 'కౌల', వంశపరంపరలుగా కూడ తెలియుచున్నవి.

తాంత్రిక బోధలలోని మూడు ముఖ్య విషయములు మంత్రము, తంత్రము, యంత్రము. సామాన్యంగా ఈ మూడును కలసియుండును. అయితే ఇందుకు కొన్ని మినహాయింపులు లేకపోలేదు. కొందరు సాధకులు కేవలము మంత్రము పఠించెదరు. వారికి యంత్రజ్ఞానము గాని తంత్రజ్ఞానము గాని ఉండదు. అటులనే ఇందుకు భిన్నముగా అనేకులు యంత్రము నొక అలంకార వస్తువుగా భావించి పూజించుచుందురు. యంత్రమును పూజించునపుడు అనుసరించవలసిన ఆచారములను గాని, మంత్రములను గాని ఎరుగని వారు కూడ కలరు.

తంత్ర సిద్ధాంతమునకు మానవశరీరములోని చక్రనిర్మాణ వ్యవస్థకు సమన్వయ సంబంధము కలదు. మానవ శరీరములో ఆరు కేంద్ర స్థానములు కలవు. ఈ స్థానములను చక్రములందురు.

మూలాధార చక్రము – వెన్నెముక అట్టడుగున
స్వాధిష్ఠాన చక్రము – నాభి దిగువ ప్రాంతము
మణిపూర చక్రము – నాభి చుట్టూ ఉన్న ప్రాంతము
అనాహత చక్రము – హృదయ స్థానము
విశుద్ధ చక్రము – కంఠస్థానము
ఆజ్ఞా చక్రము – కనుబొమల నడుమ

ఆ ఆరు చక్రములు మానవ శరీర నిర్మాణములో భౌతికముగా కలవని భావించరాదు. ఇది చాల ముఖ్యము. అవి కేవలము భావనిర్మితములు. ఈ ఆరు చక్రముల కతీతముగా సహస్రపద్మదళములున్నవి. దీనిని సహస్రార చక్రమందురు. ఇది నాలుగు వ్రేళ్ల వెడల్పులో శిరస్సునందు ఉండును. దీనిని 'నిరాలంబపురీ' అనగా ఎటువంటి ఆలంబన లేని పురము అందురు.

తాంత్రిక అభ్యాసములలో మానవశరీరము యంత్రపూజల మధ్య సమ్మేళన సమన్వయ సంబంధము కలదు.

# 2 శ్రీచక్రము

## శ్రీచక్రమనగా ఏమిటి?

తాంత్రిక కర్మకాండ ప్రకారము త్రిపురసుందరీదేవి పూజ కుపయోగించు క్షేత్రగణిత పటమును శ్రీచక్రమందురు. శక్తిపూజా సంప్రదాయములో దీనికి గొప్ప ప్రాముఖ్యము కలదు. అంతేకాక దివ్యశక్తులు కలదిగా పరిగణించబడుచున్నది. ఈ సంప్రదాయములో త్రిపురసుందరీదేవి విగ్రహము కన్న శ్రీచక్రము అధిక ప్రాధాన్యము కలదిగా భావించబడుచున్నది. అన్ని యంత్రములకన్న శ్రీచక్రము ఉత్తమోత్తమము. శ్రీచక్రమును శ్రీయంత్రమని కూడ అందురు. అయితే ఇది లక్ష్మీదేవి యంత్రముగా తలచి భ్రమించరాదు. శ్రీచక్రమునకు అనేక నామములు కలవు. ఉదాహరణకు నవయోని చక్రము, నవచక్రము, విద్యాచక్రము, శ్రీనగర, మాతృకాచక్రము మొదలైనవి. శ్రీచక్రము త్రిపురసుందరీదేవి నివాసస్థానము మాత్రమే కాదు. ఆమె యొక్క సకల శక్తులకు, వ్యక్తిత్వములకు నిలయము. అనేక తాంత్రిక గ్రంథములు శ్రీచక్రమును పలువిధములుగా వర్ణించెను. శ్రీచక్రము విశ్వమంతటిని ఆవరించియున్నదని భైరవ యామల తంత్రము తెలియజేయుచున్నది.

***శ్రీచక్రః త్రిపురసుందర్యాః బ్రహ్మాండాకారమీశ్వరీ***

అరుణోపనిషత్తు శ్రీచక్రమును ***'ఇమూనుకం భూవనాశీషధేమ'*** అని వర్ణించినది. అనగా విశ్వమంతయు శ్రీచక్రములో నిక్షిప్తమైయున్నది.

దేవీ చక్రముల వరుసక్రమము తెలిసిన వారెవరైనను ముక్తి పొందగలరని కామకలావిలాసము తెలియజేయుచున్నది.

***ఇతి కామకలా విద్యా దేవీ చక్రమాత్మికా సేయమ్***
***విదితా యేన స ముక్తో భవతి మహాత్రిపురసుందరీరూపః***

శివపార్వతుల శరీరమే శ్రీచక్రమని భైరవయామల తంత్రము ప్రకటించుచున్నది. ***'శ్రీచక్రః శివయోర్వపుః'***

శ్రీచక్రము పరమశక్తి స్వరూపముగా ఆవిర్భవించినట్లు భావించబడుచున్నది. శక్తియందు శివతత్త్వము కూడ కలదు. వారిరువురు పరస్పరము శక్తిమంతము గావించుకొనుచుందురు.

***పరస్పర తపస్సంపత్ ఫలాయిత పరస్పరౌ***

శబ్దము అర్థము వలె విడదీయరానివారు.

***వాగర్థావివ సంపుక్తౌ***

ఇది అర్ధనారీశ్వరత్వము. మాటలు వర్ణించలేని అత్యంత ఆత్మీయ సంబంధము. వారి ఐక్యశక్తి మాటల కందనిది, ఏకాత్మగా రూపొందునది.

శ్రీచక్రము మాతృకాచక్రముగా తెలియుచున్నది. ఎందుచేతననగా, ఉచ్చరించబడు వాక్కు, నాదము, అక్షరము, 'అ' నుండి 'క్ష' వరకు మొత్తము వర్ణమాలను సూచించును.

వర్ణమాలలో మొదటి అక్షరము 'అ', చివరి అక్షరము 'హ'. ఈ రెండింటిని కలిపి ఉచ్చరించినచో 'అహం' అనగా 'నేను', అహం సాధకుడు పొందే శివశక్త్యాత్మానుభవమును సూచించును.

***అతోఽకారహకారాభ్యామ్ అహమిత్యపృథక్తయా***
***ప్రపంచం శివశక్తిభ్యాం క్రోడీకృత్య ప్రకాశతే***
***(మాతృకాచక్ర సంబోధ)***

త్రిపురసుందరికి సంబంధించిన మూడు విషయములను తెలిసికొనవలెనని యోగినీ హృదయము తెలుపుచున్నది. ఈ మూడు విషయములు ఏవనగా: (1) చక్రము (2) మంత్రము (3) పూజ. అనగా యంత్ర మంత్ర తంత్రములు.

***చక్ర సంకేతకో మంత్రపూజాసంకేతకౌ తథా***
***త్రివిధః త్రిపురాదేవ్యాః సంకేతః పరమేశ్వరి***

శ్రీచక్రమునందున్న రెండు పదములలో ఒకటి 'శ్రీ', రెండవది 'చక్ర'. 'శ్రీ' అను పదమునకు అనేకార్థములు కలవు. సంపద, తేజస్సు, కీర్తి, మంగళము, శుద్ధము, పవిత్రము, మూల ప్రకృతి, పరబ్రహ్మము మొదలైనవి. 'చక్ర' అను పదము మహాత్రిపురసుందరీ యంత్రమును తెలుపును. మరియు నిది సృష్టి స్థితి లయములను; సత్త్వరజస్తమో గుణములను; భూతభవిష్యద్వర్తమానములను; జ్ఞాతృ, జ్ఞానము, జ్ఞేయములను సూచించును. బ్రహ్మాండపిండాడములు రెండింటికి చిహ్నము. బ్రహ్మాండములో జాగ్రత్ స్వప్నసుషుప్తులను, పిండాండములో శిరస్సు హృదయము మూలాధారములను సూచించును. శ్రీచక్రము బహు సుందరమైన లలిత, రాజరాజేశ్వరి, త్రిపురసుందరి అనే ముగ్గురి పరిధులను కూడ సూచించును.

## శ్రీచక్ర స్వరూపము

శ్రీచక్రమునందు తొమ్మిది ఆవరణములు కలవు. వీటిని నవావరణములందురు. దీనిని త్రిపురసుందరీదేవి నివాసభవనముగా భావించెదరు. శ్రీచక్రములోని నవావరణములను రెండు విధములుగా వర్ణించవచ్చును. ఒకటి: లోపలనున్న బిందువుతో ఆరంభించి బయటనున్న చదరపు ఆవరణమువైపు అవరోహణ క్రమములో సాగివెళ్ళుట. రెండవది: బయటనున్న చదరపు ఆవరణముతో ప్రారంభించి లోపలనున్న కేంద్రబిందువువైపు ఆరోహణ క్రమములో సాగిపోవుట. ప్రతి ఆవరణమునకు ఒక ఆకారము, నామము కలవు. ఆవరణములన్నిటికి నామములు, ఆకారములు, అధిష్ఠాన దేవతలు, సేవికలు, పూజాక్రమము, ప్రకృతి, బీజము, స్వభావము, తత్త్వము, స్థాయి, భావోద్వేగములు, రసము, అక్షరము ఉన్నవి. ప్రతి ఆవరణము గర్భగృహమునకు చేయు ప్రయాణములో ఒకొక్క మెట్టుగా పరిగణించబడుచున్నది.

శ్రీచక్రములో అన్నిటికన్న బయటగల ఆవరణము మొదటిది. దీనిని 'భూపుర'మందురు. ఇందు మూడు దీర్ఘచతురస్ర ద్వారములు కలవు. వాటియందు మూడు వృత్తములు (ఒకదానిలో నొకటి) కలవు. దీనిని త్రివలయము లేక వృత్తత్రయమందురు. వృత్తత్రయములో షోడశదళపద్మము, దానియందు అష్టదళపద్మము ఉన్నవి.

దీనియందు అనేక త్రిభుజములు ఉన్నవి. ఇవి శ్రీచక్రమునకు హృదయము. త్రిభుజములు మొత్తము నలుబది మూడు. రెండు సమరేఖలుగల నాలుగు త్రికోణములు పరస్పరము ఖండించుకొనుటవలన ఈ నలుబది మూడు త్రిభుజము లేర్పడినవి. వీటి శిఖరములు ఊర్ధ్వముఖము – శివ వర్గము. ఇవికాక అష్టదళపద్మములో సమరేఖలుగల ఐదు త్రిభుజములు అధోముఖముకలిగి యున్నవి.

వీటన్నిటి గమ్యము కేంద్రబిందువు, చక్రము మధ్యలో నుండును.
శ్రీచక్రమునకు నిర్వచనము ఆదిశంకరులవారి సుప్రసిద్ధ రచన సౌందర్యలహరియందు పదునొకండవ శ్లోకములో చూడవచ్చును.

***చతుర్భిః శ్రీకంఠైః శివయువతిభిః పంచభిరపి***
***ప్రభిన్నాభిః శంభోర్నవభిరపి మూలప్రకృతిభిః***
***చతుశ్చత్వారింశద్వసుదలకలాశ్రత్రివలయః***
***త్రిరేఖాభిః సార్ధం తవ శరణకోణాః పరిణతాః***

త్రిపురతాపిన్యుపనిషత్తు నవావరణములను తెలుపుచు, ఈ క్రింది వానితో శ్రీచక్రము నిక్షిప్తమైయున్నట్లు నిర్వచించుచున్నది.

***బిందుత్రికోణ వసుకోణ దశారయుగ్మ***
***మన్వస్రనాగదళ షోడశపత్రయుక్తమ్***
***వృత్తత్రయం చ ధరణీసదనత్రయం చ***
***శ్రీచక్రరాజ ఉదితః పరదేవతాయాః***

ఇదే విధముగా గౌడపాదాచార్యులవారి శుభగోదయము, రుద్రయామలతంత్రము, వామకేశ్వరతంత్రము మొదలైనవి శ్రీచక్రమును, అందులోని నవావరణములను వర్ణించి చెప్పెను.

అంకెలు 3, 9 శ్రీచక్రములో చాల ప్రాముఖ్యము గలవి. శ్రీచక్రములో ఉన్నటువంటి ప్రతీకలు మూడు రెట్లు, తొమ్మిది రెట్లు అని యోగినీ హృదయము తెలుపుచున్నది. త్రిభుజమందు త్రికోణములు కలవు. త్రిపురసుందరీదేవి సుందరమైనది, మూడు క్షేత్రములకు దేవత. త్రిభుజముల మొత్తము నలుబది నాలుగుగా లెక్కించినపుడు, చక్రము మధ్యనున్న బిందువు కూడ త్రిభుజముగా పరిగణించబడుచున్నది. బిందువును మినహాయించినచో, త్రిభుజములు నలుబది మూడు.

. 14 త్రిభుజములు
. 2x 10 త్రిభుజములు
. 8 త్రిభుజములు
. 1 త్రిభుజము
మొత్తము 43 త్రిభుజములు.

తొమ్మిది ఆవరణములు ఏవనగా:

1. చతురస్రము – భూపురము
2. పదహారు దళముల పద్మము – షోడశదళపద్మము

3. ఎనిమిది దళముల పద్మము – అష్టదళపద్మము
4. 14 త్రిభుజములు – చతుర్దశారము (పదునాల్గురు మనువులు, అందుచే మన్వస్రము)
5. బాహ్యములోని 10 త్రిభుజములు – బహిర్దశారము
6. లోపలి 10 త్రిభుజములు – అంతర్దశారము
7. 8 త్రిభుజములు – అష్టకోణ లేక వసుకోణ
8. 1 త్రిభుజము – త్రికోణము
9. బిందువు – కేంద్రబిందువు

మరియు ఒక వృత్తము. అందులో వృత్తత్రయము (ఒకదానిలో నొకటి). ఇవి బాహ్యచతురస్రము షోడశదళపద్మము మధ్య నుండును. శ్లోకములలో ఇది ఆవరణగా చెప్పబడుచున్నను, లెక్కింపబడుట లేదు.

శైవత్రిభుజములు (ఊర్ధ్వ శిఖరముగల నాలుగు త్రిభుజములు), శక్తిత్రిభుజములను (అధశ్శిఖరముగల ఐదు త్రిభుజములు) ఖండించుచున్నవని సామాన్యముగా అందరు అంగీకరించినప్పటికి, మొత్తము తొమ్మిది త్రిభుజములు శక్తికి ప్రతీకగా కలవను అభిప్రాయము కలదు. మరొక అభిప్రాయము: తొమ్మిది త్రిభుజములు మూల ప్రకృతినే సూచించును. అనగా నిరాకార శివము యొక్క ప్రాథమిక లక్షణములు.

శ్రీచక్రము అనేక రకములు. అవి రేఖలు లేక చిహ్నములు. రేఖలు ఒకే తలము (one domension) గలవి. చిహ్నములు మూడు తలములతో (three dimensional) ఉండునవి. రేఖలుగల శ్రీచక్రము చిత్రించబడును లేక చెక్కబడును (engrave). ఒకొక్కపుడు వివిధ ఆవరణములు వివిధరంగులలో చూపించబడును. రంగులు గ్రంథములలో సూచించబడెను. లోహముతో చేయబడిన చక్రములకు రంగులు ఉండవు.

శ్రీచక్రమును మరొక విధముగా కూడ చూపించవచ్చును. దీనిని కైలాసప్రస్తారమందురు. మాతృకలు, బీజాక్షరములు ఆవరణలో వ్రాయబడును.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1436**

* * *